క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి: పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పలపాడులోని 33 కేవీ నుంచి చీమకుర్తి పట్టణంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వరకు పీఎంఐ వర్క్ జరుగుతున్న నేపథ్యంలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రానైట్ పరిశ్రమలకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్న సందర్భంగా విద్యుత్ డిపార్టుమెంట్‌కు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ఘనంగా మాస కల్యాణం



ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో శుక్రవారం చిత్తా నక్షత్రం సందర్భంగా రాత్రి ఏడు గంటలకు ప్రసన్న చెన్నకేశవ స్వామి మాస కల్యాణం కనుల పండువగా జరిగింది. పాలక వర్గం ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కోర్ట్ సెంటర్, గడియారం వారి వీధిలోని అనంత కోదండ రామస్వామి దేవస్థానంలో శ్రీ సుదర్శన లక్ష్మీ నారసింహ యజ్ఞం ఆదివారం నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ సలహాదారులు, వేద విశ్వా విద్యాలయ అధ్యాపకులు కల్యాణపురం రాజేష్ కుమార్ భట్టర్ బృందం ఆధ్వర్యంలో ఈ యజ్ఞక్రతువును నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షులు మహంకాళి వెంకట శేషయ్య, కార్యవర్గ సభ్యులు మైనంపాటి సాయికుమార్ తదితరులు తెలిపారు. అనంతరం సుదర్శన లక్ష్మీనరసింహ యజ్ఞం కరపత్రాలను ఆవిష్కరించారు.

పూర్వ విద్యార్థికి ఆత్మీయ సన్మానం



ఏడుకొండలను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కందుకూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఎస్సై ఫలితాల్లో టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి నేలకూరి ఏడుకొండలకు కళాశాలలో శుక్రవారం ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి కష్టం వచ్చినప్పుడు కుంగిపోకుండా, అపజయం కలిగినప్పుడు నిరాశ చెందకుండా కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చిన ఏడుకొండలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సన్మాన గ్రహీత పట్టు ఏడుకొండలు మాట్లాడుతూ తాను 8 నుంచి 10వ తరగతి వరకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియెట్ టీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో చదువుకున్నానన్నారు. ఈ విజయం వెనుక మా తల్లి శ్రమ నాకు ఆర్థిక సహాయం అందించిన పెద్దలు ఉన్నారన్నారు. డీఎస్సీ రాకపోయినా నిరాశ చెందలేదని, గతంలో కానిస్టేబుల్ పోటీ పరీక్షల్లో పరాజయం పొందానన్నారు. ప్రస్తుత పోటీలో ఎస్సై ఉద్యోగం పొందటానికి రెండు సంవత్సరాల కఠోర శ్రమ ఉందన్నారు. అనంతరం కళాశాల పీడీ టి.సుబ్బారావు, అధ్యాపకులు మస్తాన్‌వలి, ఓరుగంటి వెంకటేశ్వరరావు ఉష, బాబురావు,సిబ్బందిఏడుకొండలనుసత్కరించారు.

సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపుర సుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాలను సబ్ కలెక్టర్ రాహుల్ మీనా శుక్రవారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం ఆలయాలను దర్శించిన ఆయనకు ఆలయాల అర్చకులు విశ్వనారాయణ శాస్త్రి, ప్రసాదశర్మ, ఈఓ చెన్నకేశవరెడ్డిలు సాదర స్వాగతం పలికారు. ఆలయాల్లో అర్చన, అభిషేకం నిర్వహించి ఆశీర్వచనం అందించారు. ఈయన వెంట తహసీల్దార్ వి.కిరణ్, ఆర్ఐ ముకుందహరి, వీఆర్ఓ శివలింగయ్య ఉన్నారు.

ఆరోగ్యశ్రీ అభా కార్డుల పంపిణీ

త్రిపురాంతకం: ఆరోగ్యశ్రీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి పేర్కొన్నారు. త్రిపురాంతకం సచివాలయం వద్ద ఆరోగ్యశ్రీ ఆభా కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, ఉప సర్పంచ్ ఆళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మోహన్‌దాస్, కొండయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ పెంపుతో అందరికీ ఆనందం



ఏడుగుండ్లపాడులో పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మండవ అప్పారావు

మద్దిపాడు: సామాజిక పెన్షన్లను మూడు వేల రూపాయలకు పెంచడంతో అవ్వాతాతల కళ్లలో ఆనందం వెల్లి విరుస్తోందని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఏడుగుండ్లపాడు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ దేశం మొత్తం మీద మూడువేల రూపాయల పెన్షన్ ఇస్తుంది కేవలం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. ప్రతి నెలా 2 వేల కోట్ల రూపాయల నగదు పెన్షన్లకు ఇస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 55 నెలల కాలంలో 1,47,000 కోట్ల రూపాయలు అందాయన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మాట తప్పకుండా మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా పూర్తి స్థాయిలో హామీలను అమలు చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు. ముందుగా సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, మోరబోయిన సంజీవరావు, గుడ్డ పాతలరవి, పెదకొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు గట్టినేని అయ్యన్న, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, రామాంజనేయులు, ప్రభాకర్, గ్రామ నాయకులు వల్లంరెడ్డి బాలాంజనేయ రెడ్డి, సర్పంచ్ శిల్పాసౌందర్య, ఎంపీటీసీ బొమ్మల దేవదాసు, ఏసు సచివాలయ సిబ్బంది వలంటీర్లు, అవ్వాతాతలు పాల్గొన్నారు. కాగా మండంలోని అన్ని సచివాలయాల్లో శుక్రవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు సచివాలయ కార్యదర్శులు తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలోని సర్పంచ్ ఎంపీటీసీ సభ్యుల సమక్షంలో వృద్ధులకు పెన్షన్లు పంపిణీ చేయించారు.

కొత్తపట్నం: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ పంపిణీ చేస్తామని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అన్నారు. మడరూరు గ్రామ సచివాలయం 1,2 పరిధిలో శుక్రవారం పింఛన్ల పెంపు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ రూ.3 వేలు ఇస్తామన్నారు. మడనూరులో 14 కొత్త పింఛన్ పంపిణీ చేశారు. మడనూరు సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వాయల రోశయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టో అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనని మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి కొనియాడారు. శుక్రవారం పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మరలా పింఛన్ పెంచి తీసుకోవాలంటే జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించాలని కోరారు. కార్యదర్శి వెంకటేశ్వర్లు రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మోటుమాల సచివాలయంలో పింఛన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ కోడూరి గోపి

ఒంగోలు రూరల్: ఉలిచి, దేవరంపాడు, గుండాయపాలెంలో ఒంగోలు ఎంపీడీఓ అజిత ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ జరిగింది. ఎంపీడీఓ టి.అజిత, ఈఓఆర్డీ మారెడ్డి రమణమ్మ మాట్లాడారు. ఉలిచి సర్పంచ్ మురళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూతన పెన్షన్‌లు 9 మంజూరు కాగా పాత పెన్షన్‌లు 439 మొత్తం 447 పెన్షన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం రూ.13,25,500 పంపిణీ జరిగినట్లు కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. ఆదిశేషయ్య, మదనమోహన్, మంచు మురళి పాల్గొన్నారు.



ఉలిచిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అజిత

దేవరంపాడులో సర్పంచ్ మహాలక్ష్మీ అధ్యక్షతన కార్యదర్శులు సుజాత, స్వాతి, కన్వీనర్‌లుగా వ్యవహరించారు. ఒంగోలు ఎంపీడీఓ నూతన పెన్షన్‌లు 3, పాత పెన్షన్‌లు 339 మొత్తం 342 పెన్షన్ దారులకు రూ.9, 97,000 పంపిణీ చేశారు. గుండాయపాలెంలో సర్పంచ్ రేవు సౌజన్య రామకృష్ణ అధ్యక్షతన కార్యదర్శి ఆశీర్వాదం అధ్యక్షతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒంగోలు ఎంపీడీఓ , ఈఓఆర్డీ మారెడ్డి రమణమ్మ పంపిణీ చేశారు. 41,500 మంది పెన్షన్‌దారులకు అందజేశారు.



దేవరంపాడులో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

12న రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆవిర్భావ సభ



ప్రసంగిస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ఒంగోలు టౌన్: ఈ నెల 12న విజయవాడలో నిర్వహించే రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆచార్య రంగా భవన్‌లో జరిగిన ప్రకాశం జిల్లా సమితి సన్నాహక సభ జరిగింది. జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. వడ్డే ప్రసంగిస్తూ అబద్ధాలు చెప్పి నమ్మించడంలో ప్రపంచంలోనే నరేంద్ర మోదీ మొదటి స్థానంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వ రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తుందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని మండిపడ్డారు. దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెట్టడమే లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్నారని, రైతులు, కార్మికుల పొట్టకొడుతున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు సభలో లేకుండా చూసుకొని చట్ట సభల్లో నల్లచట్టాలు చేస్తున్నారన్నారు. భారత రాజ్యాంగం అంటే బీజేపీకి మక్కువ లేదని, ఆర్ఎస్ఎస్ మూల సూత్రాలను ఆమోదించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దేశానికి పతకాలను తెచ్చిన మహిళా రెజ్లర్లు నెలల తరబడి పోరాడుతున్నా మోడీ నోరు తెరచి మాట్లాడడక పోవడం సిగ్గు చేటన్నారు. వడ్డే హనుమంతరెడ్డి, లలిత కుమారి, చుంచు శేషయ్య, కేవీవీ ప్రసాద్, దేవరపల్లి సుబ్బారెడ్డి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఓర్సు శ్రీనివాసరావు, రిటైర్డ్ సబ్ కలెక్టర్ పేరయ్య, కంకణాల రమాదేవి, రఫి, డా.రావిపాటి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

వైద్య సేవలు వినియోగించుకోండి



శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, వైద్యులు

ఒంగోలు: స్థానిక అపెక్స్ పాఠశాలలో మందాడి శ్రీనివాసరెడ్డి జయంతిని పురస్కరించుకని పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక సుజాతనగర్‌లోని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ముందుగా శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అపెక్స్ కరస్పాండెంట్ శివకోటిరెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. ఎంతోమంది పేద విద్యార్థులను సైతం ఆయన ఉచితంగా చదివించారన్నారు. ఉపాస్ సూపర్ స్పెషాల్టీ డైరెక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ వైద్యశిబిరాన్ని వినియోగించుకునేందుకు పెద్ద ఎత్తున ముందుకు వచ్చిన ప్రజానీకానికి అభినందనలు తెలియజేశారు. డాక్టర్లు రామసుబ్బారెడ్డి, జ్యోత్స్న శ్రీనివాసరావు, గోనుగుంట్ల పంపిణీ చేశారు.

ఉల్లాసంగా ఆడుదాం ఆంధ్ర



ఈతముక్కల: వాలీబాల్ ప్రారంభిస్తున్న రవీంద్ర రెడ్డి

ఈతముక్కల (కొత్తపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ఆటలను ప్రోత్సహించడానికి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల కార్యక్రమం పెట్టిందని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. ఈతముక్కల 1,2 సచివాలయం పరిధిలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను శుక్రవారం ప్రారంభించారు. అందులో భాగంగా జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, పంచాయతీ సర్పంచ్ మేడికొండ సునీత, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. క్రీడాకారులను ఒక్కోరిగా పరిచయం చేసుకున్నారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాట్‌మెంటన్, ఖోఖో ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారుల ప్రతిభను వెలిగి తీయడానికి ఆటలు పోటీలు ఉపయోగ పడతాయన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నియోజకవర్గ, జిల్లా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశం ఉంటుందన్నారు. ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ ఆటల్లో ప్రతిభ కనపరిచన వారికి ఉద్యోగంలో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఆటలు పెట్టడం ఎంతో మీరందరికీ ఉపయోగపడతాయన్నారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, హెచ్ఎం చెంచు పున్నయ్య, పంచాయతీ కార్యదర్శి కిరణ్, నితన్, తుమ్మ పుల్లయ్య, పీడీలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



నిర్మల్ నగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె బాట పట్టటంతో ఎక్కడా పారిశుద్ధ్య పనులకు లోటు లేకుండా రేయింబవళ్ళు పనులు చేయిస్తున్నారు. అందుకోసం ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. పనులకు సంబంధించి కంట్రోల్ రూంకు ఫోన్ నంబరు 08592 227799కు అర్ధ రాత్రి 12 గంటల వరకు సమాచారం చేరవేయవచ్చన్నారు.

ఆ సమయం వరకు ఫోన్‌కు అందుబాటులో ఉండే విధంగా ముగ్గురు సిబ్బందిని కేటాయించారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హెల్త్ అసిస్టెంట్ కిషోర్ కుమార్, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పీహెచ్ వర్కర్ మంతిన సుజాత, సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు హెల్త్ అసిస్టెంట్ ఎస్‌డీ బాష అధికారులకు సమాచారాన్ని అందిస్తుంటారు. నగరంలో పారిశుద్ధ్య కార్మికులు తిరిగి విధుల్లోకి చేరేవరకు నగరాన్ని ఐదు డివిజన్లుగా విభజించి ప్రత్యేకంగా పర్యవేక్షణ అధికారులను కేటాయించామని కమిషనర్ పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



చిన్నారులు ప్రదర్శిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న సిస్టర్స్, తల్లిదండ్రులు

ఒంగోలు: ఎల్‌కేజీ మొదలు 9వ తరగతి విద్యార్థుల వరకు శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. స్థానిక ఆగ్జిలియం అఖిల వికాస్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ ప్రదర్శనను పాఠశాల సిస్టర్స్ లూసీ, అప్పమ్మ, లూసియా రాణి, ట్రీసా, ప్రియాంక మరియు తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. సీనియర్ సిస్టర్ లూసీ మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులలో సైన్స్ , గణితం పట్ల ఆసక్తి పెరగాలన్నారు.

శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ



గురవారెడ్డిపాలెంలో హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం గురవారెడ్డిపాలెంలో స్థానిక రైతులకు ఎంపీడీఓ కె. రాఘవేంద్ర ఆధ్వర్యంలో సర్పంచ్ మారెడ్డి విజయలక్ష్మి, ఎంపీటీసీ కంచి మాధవి చేతుల మీదుగా శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. భూరక్ష సర్వే అనంతరం అర్హత కలిగిన 903 మందికి యాజమాన్య హక్కు పత్రాలను అందించారు. మండల పరిషత్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది,స్థానికనాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి

ఒంగోలు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉపయోగించుకోవాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఇన్‌చార్జి తీగల సత్యవతి అన్నారు. సీతారామపురం పరధిలో భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా నగర అధ్యక్షురాలు ధనిశెట్టి పావని పాల్గొన్నారు.

చంద్రబాబు అబద్ధాలకు అంబాసిడర్



మాట్లాడుతున్న దామరాజు క్రాంతికుమార్

ఒంగోలు: చంద్రబాబు పిచ్చి పరాకాష్టకు చేరుకుందని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతి కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు జిల్లాను ఎంత మాత్రం అభివృద్ధి చేశారో అందరికీ తెలుసన్నారు. అబద్ధాలకు అంబాసిడర్‌గా గుర్తింపు పొందిన చంద్రబాబు మరోమారు కనిగిరికి వచ్చి గోబెల్స్ ప్రచారాన్ని ప్రారంభించారని విమర్శించారు. జిల్లాకు 18 సార్లు వచ్చి ఏమి ఉద్ధరించావో చెప్పాలన్నారు. స్కిల్ స్కామ్ కేసులో 52 రోజులు జైలులో ఉండడంతో మానసిక పరిస్థితి పూర్తిగా దెబ్బతిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రీజనల్ కోఆర్డినేటర్ బొట్ల సుబ్బారావు మాట్లాడుతూ బీసీల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. లోకేష్ ఎర్ర పుస్తకం పెట్టుకుని అధికారులను, బీసీ నాయకులను బెదిరించడం చూస్తుంటే పోయే కాలం దగ్గరపడిందని ప్రజలకు స్పష్టం అవుతోందన్నారు. కంజుల బసివిరెడ్డి పాల్గొన్నారు.

షాదీఖానాకు భూమి పూజ

● బాలినేని హామీ నెరవేర్చడంపై హర్షం



షాదీఖానాకు భూమి పూజ చేస్తున్న రవీంద్రరెడ్డి, సుజాత, శివరామకృష్ణారావు, నజీర్

ఈతముక్కల (కొత్తపట్నం): ముస్లింలకు ఇచ్చిన హామీను ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నెరవేర్చారు. ఎన్నికల సమయంలో షాదీ ఖానా లేదని పలువురు బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసికెళ్లారు. స్పందించిన ఆయన జిల్లా పరిషత్ నుంచి రూ.35 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఈతముక్కలలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. రవీంద్ర రెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య, సర్పంచ్ మేడికొండ సునీత, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, పంచాయతీ రాజ్‌శాఖ డీఈ కాకుమాను శివరామ కృష్ణారావు, నజీర్ టెంకాయిలు కొట్టారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ముస్లింలు కల్యాణం చేసుకోవడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇళ్ల ముందు స్థలం లేక, దూరప్రాంతాలకు వెళ్లడానికి వెళ్లలేకపోతున్నామని బాలినేని దృష్టికి తీసికెళ్లారని చెప్పారు. దీంతో ఆయన హామీ మేరకు నిధులు మంజూరు అయినట్లు చెప్పారు. బాలినేనికి రుణపడి ఉంటామని చెప్పారు. పాలక సంఘం అధ్యక్షుడు కేశవరపు కోటిరెడ్డి, అడిగోపుల లక్ష్మీన్నారాయణ, బండారు వెంకటసుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, సయ్యద్ ఇస్మాయిల్, పఠాన్ నజీర్, పఠాన్ సలీమ్, బాజీ, షేక్ వలి, వలింటీర్ బాజీబీ, షేక్ కాశీం, షేక్ యాసిన్, నాయూబ్ రసూల్, తుమ్మా పుల్లయ్య, ఇంజిరీంగ్ అసిస్టెంట్, విజయ్, ఆదిలక్ష్మి, హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ నారాయణరెడ్డి, నాంచార్ల రెడ్డి పాల్గొన్నారు.

మంచి ఉత్తీర్ణత సాధించాలి



టెస్టు పేపర్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నాగులుప్పలపాడు: కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి విద్యార్థులంతా పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని చీరాల రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మామిడాల శ్రీనివాసరావు అన్నారు. రోటరీ క్లబ్ సౌజన్యంతో నిడమానూరు గ్రామంలోని కూరం రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా యూటీఎఫ్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ దోగిపర్తి వెంకట సురేష్ మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి లో జిల్లా వ్యాప్తంగా మెదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి క్లబ్ తరపున రూ.25 వేల బహుమతి అందజేస్తామని తెలిపారు. హెచ్ఎం కరీం సాహెబ్ మాట్లాడుతూ ఈ పాఠశాల దాతల సహకారంతో బాగా అభివృద్ధి చెందిందని, విద్యార్థులు కూడా బాగా చదివి మంచి ఉత్తీర్ణతతో అంతా పాసవ్వాలని కోరారు. చీరాల కృష్ణమూర్తి, బొజ్జా ఆంజనేయులు ఉన్నారు.

ట్యాబ్‌లతో సాంకేతిక పరిజ్ఞానం



ఈతముక్కలలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న రవీంద్రరెడ్డి, సుజాత, చెంచు పున్నయ్య

ఈతముక్కల (కొత్తపట్నం): సాంకేతిక పరిజ్ఞానంతో చదువుకోవడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ట్యాబ్‌లను పంపిణీ చేశారని జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి అన్నారు. ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం చెంచుపున్నయ్య అధ్యక్షతన ట్యాప్‌లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ సీఎం వైస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారన్నారు. సర్పంచ్ మేడికొండ సునీత మాట్లాడుతూ బాగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈవోఆర్డీ ఏ.బాల చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి కిరణ్, నితిన్, పీడీలు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ల పరిశీలన



ఈతముక్కల జగనన్న లేఅవుట్లను పరిశీస్తున్న పీడీ పేరయ్య, రవీంద్రరెడ్డి

ఈతముక్కల (కొత్తపట్నం): గ్రామంలో జగనన్న లేఅవుట్లను హౌసింగ్ పీడీ పేరయ్య శుక్రవారం పరిశీలించారు. ఇళ్లు ఎన్ని పూర్తి చేశారు? శ్లాబ్‌లు ఎన్ని అయ్యాయి, గృహ ప్రవేశాల వివరాలు తెలుసుకున్నారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి సమాధానం చెబుతూ 60 గృహాలు నిర్మాణంలో ఉన్నాయని, 30 గృహాలకు శ్లాబ్ పూర్తి చేశామని మిగత గృహాలు వివిధ దశలో ఉన్నాయని చెప్పారు. కొంత మంది దగ్గర నగదు లేకపోతే వ్యాపారస్తుల దగ్గరకు మెటీరియల్ ఇప్పించి నిర్మాణం చేయిస్తానని వచ్చే నెలాఖరుకు నూరు పూర్తి చేస్తామని చెప్పారు. ఈతముక్కల జగనన్న లేఅవుట్లులో విద్యుత్, రోడ్లు, నీరు మౌలిక వసతులు పూర్తి చేశారని పీడీ సంతృప్తి వ్యక్తం చేశారు. హౌసింగ్ ఈఈ పెరుగు శ్రీనివాసరావు, డీఈ వెంకటనారాయణరెడ్డి, ఏఈ అన్నం నాంచార్లరెడ్డి, తుమ్మ పుల్లయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



టెస్టు పేపర్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న దుంపా చెంచి రెడ్డి

నాగులుప్పలపాడు: గ్రామీణ స్థాయిలో ప్రతి వ్యక్తి ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీడీవో జయమణి తెలిపారు. ఆరోగ్య సురక్ష ఫేజ్-2 లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కొత్తకోట సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ జయమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు విభాగాలకు చెందిన వైద్యులు సేవలు అందించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు పోషకాహార కిట్లు అందజేశారు.ఈవోఆర్డీ వైద్యులు కులదీప్, కుమార స్వామి, అగంన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాజా ఉన్నారు.

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంతనూతలపాడు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బొడ్డువారిపాలెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో చెంచిరెడ్డితో పాటు ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ పాల్గొన్నారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని డాక్టర్‌లు గ్రామంలోని రోగలకు వైద్యపరీక్షలను నిర్వహించి మందులు అందించారు.